## క్లుప్తంగా

### పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి దర్శనానికి వస్తున్న గంగుల ప్రభాకర్ రెడ్డి

**దొర్నిపాడు:** డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమార్తె అవంతికారెడ్డితో కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ దర్శనం అనంతరం ఆయన తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే జెడ్పీటీసీ శకుంతల దొర్నిపాడులో నిర్వహించిన అంకాలమ్మ, గంగమ్మ, చౌడేశ్వరీ దేవీ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, నాయకులు శివరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జాకీర్‌బాషా, శాంతయ్య, కృష్ణారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శివప్రసాద్, సింగం వెంకటేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### భవన నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



భవనాన్ని పరిశీలిస్తున్న ఈఈ కర్రెన్న

**నంద్యాల(అర్బన్):** ప్రభుత్వ భవనాల నిర్మాణాల్లో నాణ్యత లేకపోతే చర్యలు తప్పవని ఏపీ ఎస్ఎస్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ కర్రెన్న హెచ్చరించారు. మండలంలోని మిట్నాల గ్రామంలో రూ. 2.25 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహం భవనాన్ని ఏఈ చిన్న మదారితో కలిసి ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా నాణ్యత పాటించాల్సిందేనని స్పష్టం చస్తశారు. చిన్న తిరుపతి రెడ్డి, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

### ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి




మాట్లాడుతున్న నాగేశ్వరరెడ్డి

**నంద్యాల(అర్బన్):** గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని, స్థాయికి మించి వైద్యం చేయరాదని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలో ఆదివారం నియోజకవర్గ స్థాయి ఆర్ఎంపీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జిల్లాలోని అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేసి వైద్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణయ్య, ప్రచార కార్యదర్శి దస్తగిరి హాజరయ్యారు.

### చింతలమోహన్‌రావుకు రోటరీ పురస్కారం

**నంద్యాలటౌన్:** రోటరీ క్లబ్ మిడ్ టౌన్ నంద్యాల మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ చింతల మోహన్ రావుకు అత్యున్నత పురస్కారం రోటరీ ఇంటర్నేషనల్‌లో ప్రతిష్టాత్మక పాల్ హరీష్ ఫెలో అంతర్జాతీయ పురస్కారం లభించిందని రోటరీ డీఆర్ఎఫ్‌సీ చైర్మన్, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ చిన్నప రెడ్డి తెలిపారు. ఆదివారం రోటరీ స్కూల్‌లో నిర్వహించిన మిడ్ టౌన్ రోటరీ క్లబ్ సమావేశంలో క్లబ్ అధ్యక్షులు నరసింహులు, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

### రైతుకు గాయాలు

**రుద్రవరం:** మండలంలోని చిలుకలూరుకు చెందిన షరీఫ్ అనే రైతు తలపై కర్రలు పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. షరీఫ్ ఆదివారం గ్రామ సమీపంలోనున్న తన పొలం నుంచి పశుగ్రాసం (జొన్న సొప్ప)ఎడ్ల బండిపై కల్లానికి తరలిస్తుండగా ప్రమాద వశాత్తు బండిపై నుంచి మోస్తరు సైజు కర్రలు ఆయన తలపై పడ్డాయి. దీంతో చుట్టుపక్కల రైతులు గమనించి 108కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### వ్యవసాయ విద్యుత్ వేళలు

**ఉయ్యాలవాడ :** మండలంలోని రైతులకు పగటిపూట 7 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

### డైరీ ఆవిష్కరణ

**నంద్యాల (వ్యవసాయం):** ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 2024 డైరీని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆల్ మేవా ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక కార్యక్రమాలను కొనియాడారు.

# చేతిరాతపై పట్టు.. మార్కులు రాబట్టు

- పరీక్షల్లో మార్కులపై ప్రభావం
- పది, ఇంటర్ పరీక్షలకు సమయం ఆసన్నం
- విద్యార్థులు చేతిరాతపై సాధన చేయాలంటున్న నిపుణులు



చక్కని చేతిరాత కోసం సాధన చేస్తున్న విద్యార్థులు,



విద్యార్థులకు చేతిరాతపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు


**గోస్పాడు:** మన చేతిరాతను బట్టి కూడా మన మనస్తత్వాన్ని, గుణగణాలను కూడా అంచనా వేయవచ్చునని నిపుణులు చెబుతారు. పరీక్షల్లో చేతిరాత కీలకంగా మారుతుంది. అందంగా రాసే అక్షరాలకు వచ్చే అదనపు మార్కులే మంచి ఫలితాలు అందిస్తాయి. పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు సమీపిస్తున్నాయి. ఇప్పటికే బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేశాయి. మార్చిలో ఇంటర్, పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకుని చదవుతున్నారు. విద్యాశాఖ అధికారులు కూడా ఇందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించి పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. పరీక్షల్లో ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయడం ఎంత ముఖ్యమో, చేతిరాత కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చేతిరాత బాగుంటే మూల్యాంకనం చేసే వారికి సులువుగా అర్థమవుతుంది. అలాగే చేతి రాత మార్కులను రాబట్టడంతో కీలకపాత్ర పోషిస్తుంది.

**మూల్యాంకనంపై ప్రభావం..**

చేతిరాతపై మంచి నైపుణ్యం కలిగిన విద్యార్థులకు వాటి ఫలితంగా మంచి మార్కులు వచ్చేందుకు వీలవుతుంది. దస్తూరీ బాగా లేకుంటే. సమాధానం అర్థంకాక మార్కులు కొంతమేర తగ్గే అవకాశం ఉంటుంది. ఈ ప్రభావం మొత్తం మార్కులపై పడుతుంది. అందువల్ల విద్యార్థులు చేతిరాతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. చేతిరాత బాగుంటే విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. పరీక్షల సమయంలో ఇటు సబ్జెక్టులకు సన్నద్ధమవుతూ మరోవైపు రోజులో కొంత సమయం చేతిరాతపై దృష్టి సారిస్తే పట్టు వస్తుంది.

**ఇలా రాయాలి..**

- జవాబు పత్రాల్లోనే సమాధానాలు స్పష్టంగా రాయాలి.
- నాలుగు వైపులా మార్జిన్లు వేసుకుంటే మంచిది.




చక్కటి చేతిరాత

- ఒక లైనుకు మరో లైనుకు కొంత గ్యాప్ ఇవ్వాలి.
- పదానికి పదానికి తగినంత స్పేస్ వదలాలి.
- వాక్యాలు వరుస క్రమంలో ఉండాలి.
- బొటన వేలు, మూడవ వేలికి మధ్య చూపుడు వేలు సహాయంతో పెన్నును చక్కగా పట్టుకోవాలి.
- ఇలా చేయడం వలన రాసే సమయంలో పెన్ను స్పీడుగా ముందుకు కదులుతుంది.
- పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకోవాలి. లేకుంటే ఆ ప్రభావం చేతిరా తపై కూడా పడుతుంది.
- మనసు ప్రశాంతంగా ఉంటే చేతిరాత చక్కగా వస్తుంది.
- అక్షరాలు మరీ పెద్దవి, చిన్నవిగా ఉండకూడదు.
- గుండ్రంగా, అందంగా రాయాలి.
- గొలుసు రాతకు మార్కులు తగ్గే అవకాశముంటుంది.

### నిత్య సాధనతోనే సాధ్యం



విద్యార్థులు చక్కటి చేతిరాతను నిత్య సాధనతో సాధించవచ్చు. చదవడటంతో పాటు వారు నేర్చుకున్న సమాధానాలను అందంగా రాసేందుకు రోజులో కొంత సమయాన్ని కేటాయించి సాధన చేయాలి. విద్యార్థులు పరీక్షల్లో రాసే చక్కటి రాతతో మూల్యాంకనం చేసే వారికి బాగా అర్థమై మంచి మార్కులు వేయడానికి అవకాశముంటుంది.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

### చేతి రాతపై అవగాహన కల్పిస్తున్నారు



పదవ తరగతి పరీక్షల సమయం సమీపిస్తున్నందున పాఠశాలలో విద్యార్థులకు చక్కటి చేతి రాత వచ్చేలా ఉపాధ్యాయులు ముందు నుంచే అవగాహన కల్పిస్తున్నారు. నిత్యం పాఠ్యాంశాల బోధన సమయంలో విద్యార్థులు రాసే నోట్ పుస్తకాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. దీంతో మాకు చేతి రాతలో కొంత మేరకు మార్పు వచ్చింది. పరీక్ష సమయంలో ప్రశ్నలకు జవాబులు రాసే విధానంపై కూడా అవగాహన కల్పిస్తున్నారు.

– కీర్తన, పదవ తరగతి, యాళ్లూరు ఉన్నత పాఠశాల

### ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



చేతి రాత అందంగా ఉండేలా విద్యార్థులకు ప్రత్యేకంగా సూచిస్తున్నాం. చక్కటి చేతిరాత రావాలంటే సాధనతోనే సాధ్యమవుతుంది. చేతిరాతను అభివృద్ధి చేసుకునేందుకు ప్రతీ రోజు కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. రాత బాగుంటే పేపరు వాల్యూయేషన్ చేసే టీచర్‌కు విద్యార్థిపై మంచి అభిప్రాయం ఏర్పడుతుంది.

– శివనాగేంద్ర, హెచ్ఎం, యాళ్లూరు హైస్కూల్



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

# 46 సంవత్సరాల తరువాత..

- ఆదివారం కలుసుకున్న పూర్వ విద్యార్థులు
- నాటి స్మృతులను గుర్తు చేసుకొని ఉల్లాసంగా గడిపిన వైనం

**నంద్యాల(న్యూటౌన్):** కలిసి చదువుకున్న వారంతా 46 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఇన్నేళ్ల తరువాత చూసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ.. తమను పరిచయం చేసుకుంటూ.. నాడు తాము కలిసి చేసిన అల్లరిని గుర్తు చేసుకొని ఉల్లాసంగా..ఉత్సాహంగా గడుపుతూ స్నేహితుల ఒడిలో వాలిపోయారు. పట్టణంలోని సంజీవ నగర్‌లోనున్న శ్రీ రామకృష్ణ విద్యాలయం 1978 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు పట్టణంలోని రామాలయం ఫంక్షన్ హాల్ ఆదివారం కలుసుకున్నారు. 46 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులు డాక్టర్ రవికృష్ణ, గెలివి రామకృష్ణ, పాణ్యం ప్రభాకర్ రెడ్డి, కృష్ణమూర్తి, సత్యనారాయణ, లగిశెట్టి సురేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా తమ బ్యాచ్‌కు చెందిన మృతి చెందిన 24 మందికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాటి స్మృతులను గుర్తు చేసుకొని ఆహ్లాదంగా, సంతోషంగా గడిపారు. అనంతరం నివర్తి మోహన్ కుమార్, నరసింహారావు, మల్లికార్జునుడు, శ్రీరాములు, ఆంజనేయులు, రామసుబ్బారెడ్డి, చంద్రశేఖర్ శివరామయ్య, రామ్మూర్తి, సుబ్బరాయుడు, ఆశీర్వాదమ్మ గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని తీర్మాణించారు. మురళీంద్రరెడ్డి, సత్యం, ఉమామహేశ్వర రావు, మహేశ్వరరెడ్డి, శివకుమార్, పాండురంగయ్య. మల్లయ్య, రమాదేవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


## వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధం



మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి

**దొర్నిపాడు:** రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ లక్కు చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన దొర్నిపాడులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తానే పదిమందికి టికెట్ ఇప్పించే స్థాయి అని చెప్పుకునే భూమా అఖిలప్రియ ప్రస్తుతం తనకే ఎంతో ఒడిదుడుకుల మధ్య సీటు కేటాయించడంతో సంబరాలు చేసుకునే రోజులు వచ్చాయని ఎద్దేవా చేశారు. సీటు ప్రకటనకే సంబరాలు చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లను చూస్తుంటే జాలేస్తుందన్నారు. ఇళ్లు అలకగానే పండగ కాదని రానున్న ఎన్నికల్లో ప్రజలు మళ్లీ మిమ్మల్ని ఇంటికే పరిమితం చేస్తారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని, ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఓట్లకోసం వారు కూడా ఎదురు చూస్తున్నారని, ఎవరు ఏమి చేశారో వారికి తెలిసినంతగా మరెవరీ తెలియదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా మారాయని, మరి మీ నాయకుడు చేసినవి ఒక్కటైనా ఉంటే వెతుక్కోవాలని చెప్పారు. నాయకులు దశరథరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కుంట నీటిని తాగొద్దు





అడుగంటిన శివరామయ్య కుంట, కుంటవద్ద ఏర్పాటు చేసిన నోటీసు

**నంద్యాల(అర్బన్):** మిట్నాల గ్రామంలోని శివరామయ్య కుంట, ఎస్సీ కాలనీలోని కుంట అడుగంటాయని, వాటిల్లోని నీటిని తాగరాదని పంచాయితీ కార్యదర్శి విజయలక్ష్మి శివరామయ్య కుంట వద్ద నోటీసులు అతికించారు. మార్చి నెల లోపు కుంటలను నీటితో నింపాల్సి ఉంది. అయితే ఇటీవల మిట్నాల చెరువుకు వచ్చిన నీటిని కొందరు రైతులు పంట సాగుకు వినియోగించుకున్నారు. దీంతో కుంటలు అడుగంటాయి. కాగా గ్రామంలో ఏర్పాటు చేసిన చేతి పంపుల ద్వారా ఉప్పునీరు వస్తుంది. ఇటీవల గుంతనాల రహదారి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన చేతి పంపు నీరు, వెలుగోడు రిజర్వాయర్ నుంచి రానున్న నీటిని కుంటలకు మళ్లిస్తే నీటి సమస్య తీరుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

### రహదారులకు మరమ్మతులు

**ఉయ్యాలవాడ :** మండలంలోని ఆర్అండ్‌బీ రహదారుల మరమ్మతుల కోసం రూ. 16 లక్షలు మంజూరయ్యాయని ఆర్అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె ఆర్అండ్‌బీ రహదారిలో 17వ కి.మీ. నుంచి 26వ కి.మీ. వరకు రూ.8 లక్షలు, గుళ్లదుర్తి నుంచిరివరం వరకు రూ.3.50 లక్షలు, జమ్మలమడుగు, కోవెలకుంట్ల ప్రధాన రహదారి నుంచికరవాడ, ఒంటెద్దుపల్లె వరకు రూ.4.50 లక్షలతో ప్యాచ్ వర్క్స్ చేపట్టేందుకు వీటిని వ్యయం చేయనున్నట్లు డీఈ వివరించారు.

### బాధిత కుటుంబానికి సాయం

**నంద్యాల(అర్బన్):** ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న నూనెపల్లెకు చెందిన భూలక్ష్మికి ఎరుకల సమైక్య సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు నాగార్జున ఆధ్వర్యంలో ఆదివారం రూ. 5 వేల ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. స్థానిక కార్యాలయం వద్ద సుబ్బారావు మాట్లాడుతూ ఇటీవల భూలక్ష్మి భర్త, కుమార్తెలు మృతి చెందడంతో తీవ్ర మనోవేదనకు గురైందన్నారు. విషయం తెలుసుకుని ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని చేయూతనిచ్చామని చెప్పారు.లింగమయ్య, కృష్ణయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

## వేగంగా ప్రహరీ నిర్మాణం



ఉయ్యాలవాడలో చురుగ్గా సాగుతున్న ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ పనులు

**ఉయ్యాలవాడ :** మండల కేంద్రంలోని ముస్లిం మైనారిటీ శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. నంద్యాల పార్లమెంట్ సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి ఎంపీ ల్యాండ్స్ నిధులు రూ.20 లక్షలు కేటాయించారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉండిపోయిన ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. త్వరలో పనులు పూర్తవనుందని ముస్లిం మతపెద్దలు పేర్కొన్నారు. గతంలో ప్రహరీ నిర్మించాలని ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్కసారి వినతి పత్రం అందజేయగా వెంటనే నిధులు విడుదల చేయడం అభినందనీయమన్నారు. నెలాఖరుకు పనులు పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్ ఏఈ రామకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు.

### నేడు కంచి పీఠాధిపతి రాక

**నంద్యాల(వ్యవసాయం):** కంచి కామకోటి పీఠం పీఠాధిపతి జగద్గురు పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి సోమవారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని ప్రథమనంది సమీపంలోనున్న శ్రీ గాయత్రీ దేవాలయానికి రానున్నారని బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు కరణం మురళీ కృష్ణ రావు, సెక్రటరీ సుధీర్ ఆదివారం తెలిపారు.

### నేడు స్పందన

**ఉయ్యాలవాడ :** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని, అక్కడ సమస్యలు పరిష్కారం కాకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమంలో వినతి పత్రాలు అందజేయాలని కోరారు.

### నామినేషన్ల దాఖలుకు నేడు ఆఖరు

**నంద్యాల (న్యూటౌన్):** నంద్యాల అధ్యక్ష ఖండపు పీఠాధిపతుల (బిషప్) ఎన్నికల్లో పోటీచేసే (క్రైస్తవ గురువులు) అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలుకు ఈ నెల 26 తేదీన చివరి రోజని బిషప్ ఫ్రిక్‌లేసస్ కమిటీ ఎలక్షన్ చైర్‌పర్సన్ సాల్మన్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన నామినషన్ల ప్రక్రియ సోమవారంతో ముగుస్తుందన్నారు. నామినేషన్లు దాఖలు చేసే నంద్యాల డయాసిస్‌లోని గురువులు సోమవారం సాయంత్రం 6 గంటలలోపు తమ పత్రాలను అందజేయవచ్చని చెప్పారు. ఇప్పటి వరకు ఐదుగురు గురువులు నామినేషన్లు దాఖలు చేశారన్నారు.

### మహానందిలో వసతి గదులు ఫుల్

**మహానంది:** మహానందిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొనడంతో దేవస్థానానికి చెందిన వసతి గృహాలు నిండిపోయాయి. దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న టీటీడీ, నాగనంది సముదాయాల్లో ఉన్న గదులు నిండిపోవడంతో భక్తులు ప్రైవేటు వసతి గృహాల వైపు వెళ్లాల్సి వచ్చింది. కొందరు లాడ్జీల నిర్వాహకులు పోలీసుల నిబంధనలు పట్టించుకోకుండా అధిక మొత్తంలో వసూలు చేసినట్లు విజయవాడ, గుంటూరు ప్రాంతాల భక్తులు వాపోయారు. లాడ్జీల వద్ద గదుల ధరల బోర్డులు ఏర్పాటు చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేశారు. రెండు తెలుగురాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

**నీటిని సాగుకు వినియోగించుకోవద్దు**

బండిఆత్మకూరు మండలంలోని కుందూ, కేసీ కాలువల్లో ప్రవహించే నీటిని పంటల సాగుకు వినియోగించుకోవద్దని వీఆర్‌ఓలు ఏసుపాదం, నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు బండిఆత్మకూరు మండలంలోని పరమటూరు, భోజనం గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ నీటి కొరత, వర్షాభావం పరిస్థితుల దృష్ట్యా కేవలం తాగునీటి కోసం నీటిని వదిలారన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నీటిని వినియోగిస్తే కేసులు నమోదు చేస్తారన్నారు.

## వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకించండి

**నంద్యాల(న్యూటౌన్):** ప్రపంచ వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకించి ఢిల్లీ సరిహద్దు వద్ద జరుగుతున్న రైత ఉద్యమాలకు మద్దతు పలకాలని ఏపీ రైతు సంఘాల నాయకులు రాజశేఖర్, సుధాకర్ రామరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక నరసింహయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రవేశ పెట్టిన ప్రతిపాదనలను నిరసిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టాలని కోరారు. దోహా నగరంలో జరిగే ప్రపంచ వాణిజ్య సంస్థ సమావేశాన్ని వ్యతిరేకించాలన్నారు. వాణిజ్య సంస్థ ప్రతిపాదనలు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార భద్రత చట్టాన్ని నిర్వీర్యం చేయాలనే ఈ ప్రతిపాదనలు ప్రవేశ పెట్టారని మండిపడ్డారు. ఆయా అంశాలపై అన్ని మండల కేంద్రాల్లో కార్మిక సంఘాలను కలుపుకుని నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. బాలవెంకట్, గౌస్, సురేష్ పాల్గొన్నారు.

## మార్చి 2న ఉమ్మడి జిల్లాల సీపీఐ సమావేశం

**నంద్యాల(న్యూటౌన్):** కర్నూలు నగరంలో మార్చి 2వ తేదీన నిర్వహించనున్న ఉమ్మడి జిల్లాల సీపీఐ కార్యకర్తల సమావేశానికి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హాజరవుతారని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు ఉద్యమంపై వ్యవహరిస్తున్న దుర్మార్గపు చర్యలను నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన దేశవ్యాప్తంగా రైతులు నిరస తెలియజేయనున్నారని, ఇందుకు సీపీఐతో పాటు ఇండియా కూటమి మద్దతు ఇస్తుందన్నారు. ప్రజా సమస్యలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కర్నూలు జరిగే సమావేశంలో నారాయణతో పాటు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య తదితరులు పాల్గొంటారని చెప్పారు. ప్రసాద్, సోమన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# బహిరంగ వేలాలపై అభాండాలు

- నేడు నిర్వహించే వేలాలపై ముందుగానే పత్రికల్లో ప్రకటనలు
- పారదర్శకంగా వేలం నిర్వహిస్తున్నా పచ్చ పత్రికలో తప్పుడు రాతలు
- పలు దుకాణాలకు రూ.6వేల నుంచి రూ. 26వేలకు పెంచడాన్ని సహించలేని వైనం



మున్సిపల్ హైస్కూల్ వద్ద దుకాణాల సముదాయం

**నంద్యాల(సిటీ):** పట్టణంలోని పలు మున్సిపల్ దుకాణాలకు సోమవారం వేలం నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని 219 దుకాణాలకు గాను 182 షాపుల లీజు కొనసాగుతుండగా మిగిలిన 37 దుకాణాలకు ఆగస్టు 28, 29 తేదీల్లో వేలం నిర్వహించి 11 దుకాణాలకు పాటదారుల రాగా వాటిని ఆగస్టు 31న కౌన్సిల్‌లో తీర్మాణానికి ప్రవేశపెట్టారు. మిగిలిన 26 దుకాణాలకు అదనంగా డిసెంబర్ నెలలో ఖాళీ అయిన 6 దుకాణాలు మొత్తంగా 32 దుకాణాలకు ఈ ఏడాది జనవరి 20న వేలం నిర్వహించారు. ఇందులో 12 దుకాణాలను పాటదారులు దక్కించుకున్నారు. ఇక మిగిలిన 20 దుకాణాలకు వేలం నిర్వహించేందుకు ముందుగానే పలు పత్రికల్లో ప్రకటనలు సైతం ఇచ్చారు. అలాగే మైకుల ద్వారా పట్టణంలో ప్రచారం చేశారు. అయితే దుకాణాల వేలంలో రాజకీయ ఒత్తిళ్ల పనిచేస్తున్నాయని, కావలసిన వారికే ఇప్పిస్తున్నారని పచ్చ పత్రిక కథనాలు రాయడంపై వ్యాపార వర్గాల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇలాంటి రాతలతో తమను మీ రాజకీయాల్లోకి లాగొద్దని వారు స్పష్టం చేస్తున్నారు. జనవరి 20న పలు దుకాణాలకు వేలం నిర్వహించగా, పలు దుకాణాల మరమ్మతులు, కోర్టు కేసుల కారణంగా వాయిదా వేశారు. వీటిని కూడా ఆ పత్రిక రాజకీయ కోణంలో చూపి తన అక్కసును వెళ్లగక్కింది. అంతేకాకుండా రాజకీయ ఒత్తిడితో వేలాలను వాయిదా వేస్తున్నారని పేర్కొంది. గతంలో కొందరు వ్యాపారులు సాల్వెన్సీ, గుడ్‌విల్, డిపాజిట్లు నిర్ణీత గడువులోగా సమర్పించకపోవడంతో కొన్ని దుకాణాలకు వేలం నిర్వహించి వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత కొన్ని దుకాణాలు కోర్టు ఉత్తర్వులు, మరి కొన్ని మరమ్మతుల కారణంగా వేలం ఆలస్యమైంది.

**గుడ్ విల్, డిపాజిట్ల పెంపు..**

2022–23లో రూ.11 లక్షల బాడుగ, రూ.11లక్షల గుడ్‌విల్ వచ్చే దుకాణాల నుంచి గత నెలలో జరిగిన వేలంలో రూ. 20లక్షల బాడుగ, రూ.12లక్షల గుడ్‌విల్ వచ్చిందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

**రూ.26 వేలకు పెరిగిన అద్దె..**

గత నెలలో చేపట్టిన వేలంలో కనీస ధర రూ.6వేలు ఉన్న పలు దుకాణాలు రూ.20 వేలకు పైగా పాట పాడటంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. ఇందులో ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని దుకాణాలు గత సంవత్సరం రూ.6 వేలు బాడుగ చెల్లించగా.. ఈ ఏడాది వేలంలో రూ.26వేలకు పాటదారుడు దక్కించుకోవడం విశేషం. ఇదే కాంప్లెక్స్‌లో రూ.22 వేలకు మూడు దుకాణాలు, రూ.22,500ను దక్కించుకున్నారు.

### వేలాల్లో రాజకీయ ప్రమేయం లేదు



గత నెల 20న నిర్వహించిన వేలంలో మేం కూడా పాల్గొన్నాం. ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని షాప్ నంబర్ 49ని రూ.20 వేలకు దక్కించుకున్నాం. గతంలో ఈ దుకాణం రూ.6వేల గరిష్టంగా నెలసరి అద్దె చెల్లించేవారు. కానీ బహిరంగ వేలంలో మేం ఇతరులతో పోటీ పడి దక్కించుకున్నాం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదు.ప్రజలందరి ముందే అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు.

– వై.నాగేశ్వరరావు, నంద్యాల

### గతం కంటే అధికంగా వెచ్చించి దుకాణాన్ని దక్కించుకున్నాం

మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం ద్వారా ఆర్టీసీ బస్టాండ్‌లోని షాప్ నంబర్–2 ను రూ.10 వేలకు దక్కించుకున్నాం. గతంలో ఇదే దుకాణం రూ.6వేలు మాత్రమే చెల్లించేవారని తెలిసింది. ఎవరి ప్రమేయం లేకుండా సాల్వెన్సీ, గుడ్‌విల్, డిపాజిట్ చెల్లించి ఇతరులతో పోటీ పడి దక్కించుకున్నాం.

– సాహేరా, ఆర్టీసీ బస్టాండ్, దుకాణం నంబర్–2

### ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు



మున్సిపల్ దుకాణాల బహిరంగ వేలం పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. నేడు జరిగే వేలాలకు సంబంధించిన దుకాణాల వివరాలపై ముందుగానే పలు పత్రికల్లో ప్రకటనలు ఇచ్చాం. వ్యాపారులకు ముందుగా తెలియజేసిన తర్వాతనే వేలం వేస్తున్నాం. దక్కించుకున్న వారు సాల్వెన్సీ, గుడ్‌విల్, డిపాజిట్లు చెల్లించాలి.

– నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, నంద్యాల